RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ శనివారం 13.12. 2025 సంపుటి : 03 సంచిక : 12 పేజీలు : 08 వెల: రూ.5

Karimnagar Saturday 13.12.2025 Volume:03 Issue 2 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

## జనజీవన స్రవంతిలోకి మరో 10 మంది నక్సలైట్‌లు




ఆపరేషన్ ఖగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం నిర్మూలనకు పూనుకున్నప్పటి నుంచి ఎంతో మంది నక్సలైట్‌లు ఎన్‌కౌంటర్లలో మరణించారు. అదేవిధంగా భారీ సంఖ్యలో నక్సల్స్ విడతల వారీగా లొంగిపోతున్నారు. తాజాగా ఛత్తీస్‌గఢ్ లోని బస్తర్ ప్రాంతంలో మరో 10 మంది నక్సైట్‌లు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు.ఈ విషయాన్ని బస్తర్ ఐజీ పీ సుందర్‌రాజ్ మీడియాకు వెల్లడించారు. బస్తర్ రీజియన్‌లో నక్సలిజాన్ని రూపుమాపి, అభివృద్ధికి బాటలు వేయడం కోసం తమ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇందుకోసం భద్రతా బలగాలు పలు ఆపరేషన్‌లు చేపడుతున్నాయని అన్నారు. ఫలితంగా పెద్ద సంఖ్యలో నక్సలైట్‌లు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలుస్తున్నారని చెప్పారు.శుక్రవారం లొంగిపోయిన 10 మంది నక్సలైట్‌లపై రూ. 33 లక్షల రివార్డులు ఉన్నాయని చెప్పారు.







# రేవంత్ వర్సెస్ మెస్సీ

- నేడే ఫుట్‌బాల్ మ్యాచ్
- సాయంత్రం 7 గంటల నుంచి 8 గంటల వరకు మ్యాచ్

సీఎం రేవంత్ రెడ్డి , మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఉప్పల్ స్టేడియం వేదికగా జరుగనున్న ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెల కొంది. ఫుట్‌బాల్ మ్యాచ్ టికెట్లు కూడా హాట్‌కేకుల్లా అమ్ముడు పోయాయి. రేవంత్, మెస్సీ మ్యాచ్ నేపథ్యంలో రాచకొండ సీపీ సుధీర్ బాబు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. హైదరా బాద్ ఇమేజ్‌ను పెంచే ఈవెంట్ ఇది అని అన్నారు.శనివారం సాయంత్రం 7 గంటల నుంచి ఎనిమిది గంటల వరకు మ్యాచ్ జరుగనుందని.. మ్యాచ్ సందర్భం గా అందరూ క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. స్టేడియం దగ్గర పాసులు అమ్మబడవని... ఇప్పటికే ఆన్‌లైన్‌లో పాసులను విక్రయించినట్లు చెప్పారు. పాసులు లేని వారు స్టేడియం వద్దకు రావద్దన్నారు. మెస్సీకి జడ్ కేటగిరి భద్రత ఏర్పాటు చేశామని.. గ్రీన్ చానెల్ ద్వారా మెస్సీ ప్రయా ణం చేస్తారని వెల్లడించారు.

4

### పాసులు లేనివారు స్టేడియానికి రావొద్దు

### రాచకొండ సీపీ కీలక ఆదేశాలు



## జనవరి 30 నుంచి నిరాహార దీక్ష చేస్తా

**అన్నా హజారే**



ప్రభుత్వ తీరుకు నిరసనగా తాను జనవరి 30 నుంచి నిరాహార దీక్ష చేస్తానని ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నాహజారే ప్రకటించారు.మహారాష్ట్రలోని తన స్వగ్రామమైన రాలేగావ్ సిద్ధిలో దీక్ష చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న లోకాయుక్త చట్టాన్ని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.ప్రజా సంక్షేమానికి లోకాయుక్త చట్టం చాలా కీలకమని, పదేపదే హామీలు ఇచ్చినప్పటికీ దానిని విస్మరిస్తున్నారని, ప్రభుత్వ తీరుకు నిరసనగా తాను నిరాహార దీక్ష చేపడుతున్నానని 88 ఏళ్ల హజారే తెలిపారు. ఇప్పుడు తాను చేపట్టే నిరాహార దీక్షే తన ఆఖరి నిరసన అవుతుందేమోనని వ్యాఖ్యానించారు. లోకాయుక్త చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అన్నా హజారే 2022లో కూడా తన స్వగ్రామమైన రాలేగావ్ సిద్ధిలో నిరాహార దీక్ష చేశారు.దాంతో చట్టాన్ని అమలు చేస్తామని అప్పటి ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంతో దీక్షను విరమించారు. ఆ తర్వాత ఓ కమిటీ బిల్లును రూపొందించింది. ఆ బిల్లును మహారాష్ట్ర శాసనసభలోని ఉభయ సభలు ఆమోదించి, రాష్ట్రపతి ఆమోదానికి పంపాయి. ఆ చట్టం ఇంకా క్షేత్రస్థాయిలో అమలు కాలేదని అన్నాహజారే చెప్పారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌కు తాను ఏడు లేఖలు రాసినప్పటికీ ఎలాంటి స్పందన రాకపోవడంతో నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వం లోకాయుక్త చట్టాన్ని క్షేత్రస్థాయిలో ఎందుకు అమలు చేయట్లేదో తనకు తెలియట్లేదని విమర్శించారు.

# ఏదో ఒక రోజు సీఎం అవుతా

- నా దృష్టికి బీఆర్ఎస్ నేతల అక్రమాలు
- అసలు కథ ముందుంది
- నేను మంచి దాన్ని కాదు. కాళ్ళు విరగొడతా
- జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపాటు

**హైదరాబాద్, డిసెంబర్ 12:**

మాజీ మంత్రి హరీష్ రావు, బీఆఆర్ఎస్ టార్గెట్‌గా జాగృతి అధ్యక్షురాలు కవిత మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావుతో హరీష్ తనపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతల అక్రమాలు తన దృష్టికి వస్తున్నాయని... అసలు కథ ముందుంది అంటూ కామెంట్స్ చేశారు. 'నేను మంచి దాన్ని కాదు. కాళ్ళు విరగొడతాను' అంటూ హెచ్చరించారు. అధికారంలో ఉన్న పదేళ్లలో తాను, తన భర్త ఒక్క పని అయినా అడగామా అని ప్రశ్నించారు. తాను ఏ తప్పూ చేయలేదని.. బీఆర్ఎస్‌లో 10 ఏళ్లలో ఒక్క రూపాయి సంపాదించలేదని స్పష్టం చేశారు.హరీష్ రావు, కేటీఆర్, కేసీఆర్‌ను ఒక్క సహాయం కూడా అడగలేదని తెలిపారు. ఉద్యమంలో ఎవరు ఏమి చేశారనేది తాను ఎప్పుడూ చెప్పలేదన్నారు. ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు వారం రోజుల్లో అపాలజీ చెప్పాలని.. లేదంటే కోర్టుకి ఈడుస్తామని వార్నింగ్ ఇచ్చారు. తనను పార్టీ నుంచి పంపించారని.. అయినా వాళ్ల కళ్ళు చల్లబడ లేదా అని వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ కిటికీలు తెరిచిందని.. కాంగ్రెస్ డోర్స్ ఓపెన్ చేసిందన్నారు. తనపై ఎవ్వరు ఎలాంటి ఆరోపణలు చేసినా జవాబు చెబుతానన్నారు.బీఆర్ఎస్ హయాంలో చాలా తప్పిదాలు జరిగాయని... అవి తన



దృష్టికి వస్తున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ వాళ్ళు తప్పు చేశారనే.. రేవంత్ అధికారంలోకి వచ్చారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన లావాదేవీలకు, కాంగ్రెస్‌కు సంబంధం ఉందని ఆరోపించారు. 'నేను ఏదో ఒక రోజు ముఖ్య మంత్రి అవుతా. హరీష్ రావు.. విజ్ఞత అని తప్పించుకుంటున్నారు. లైన్‌లు నేను దాటలేదు. నేను ఇంకా ఊరుకోను ' అంటూ కవిత సంచలన కామెంట్స్ చేశారు.

# జనగణనకు నిధుల కేటాయింపు

- బొగ్గు గనుల్లో సంస్కరణలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు

**ప్రధాన నరేంద్రమోదీ నేతృత్వం లోని కేంద్ర క్యాబినెట్ శుక్రవారం కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులో ముఖ్య మైనది జనగణన కోసం నిధులు కేటాయించడం. ఈ సారి జనగణన కోసం కేటాయించిన రూ.11,718 కోట్ల బడ్జెట్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలి పింది. 2027లో రెండు విడతల్లో జన గణన జరగనుంది.**

**ఢిల్లీ:** ప్రధాన నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ శుక్రవారం కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులో ముఖ్యమైనది జనగణన కోసం నిధులు కేటాయించడం. ఈ సారి జనగణన కోసం కేటాయించిన రూ.11,718 కోట్ల బడ్జెట్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 2027లో రెండు విడతల్లో జనగణన జరగనుంది. అయితే ఈసారి డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించి జనగణన చేపట్టనున్నారు. కాగా ఇలా డిజిటల్ టెక్నాలజీతో జనగణన చేపట్టడం ఇదే తొలిసారి.బొగ్గు గనుల్లో సంస్కరణలకు కూడా కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అదేవిధంగా మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పునకు కూడా క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. పూజ్య బాపు గ్రామీణ ఉపాధి హామీ పథకంగా ఆ పథకం పేరును మార్చింది. అదేవిధంగా ఈ పథకం కింద పని దినాలను 100 నుంచి 120కి పెంచింది. కేంద్ర క్యాబినెట్ నిర్ణ



యాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.అదేవిధంగా భారత్-ఒమన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌కు, బీమా రంగంలో ఫుల్ ఎఫ్‌డీఐలకు కూడా కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కాగా జనగణనతోపాటే కులగణనను కూడా కేంద్రం చేపట్టనుందని మంత్రి తెలిపారు. అయితే వ్యక్తుల కులం వివరాలు దాచి ఉంచుకునే అవకాశం పౌరులకు కల్పిస్తున్నామని ఆయన చెప్పారు. డిజిటల్ డాటాలో పౌరులు తమ వ్యక్తిగత వివరాలను హైడ్ చేసుకుంటే ఎవరికీ కనిపించవని, కేవలం ప్రాథమిక సమాచారం మాత్రమే కనిపిస్తుందని స్పష్టం చేశారు.

# కోవర్ట్ రాజకీయాలు మానుకోవాలి

❍ముదిగుంట కాంగ్రెస్ సర్పంచి అభ్యర్థి బత్తుల సుజాత శ్రీనివాస్ యాదవ్‌కు మద్దతు ఇవ్వాలి

❍ముదిగుంట కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక ఇంచార్జి నర్సింగ్

**జనోదయ : ఉమ్మడి ఆదిలాబాద్**

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ముదిగొండ గ్రామంలో బత్తుల సుజాత శ్రీనివాస్ యాదవ్ సర్పంచ్‌గా పోటీ చేస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ గ్రామానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తరపున ఇన్‌చార్జ్ నర్సింగును నియమించారు. ఈ సందర్భంగా నర్సింగ్ మాట్లాడుతూ ముదిగొండ గ్రామంలో 100కు 99 శాతం ముదిగుంట ప్రజలు భక్తుల సుజాత శ్రీనివాస్ యాదవ్‌ని సర్పంచ్‌గా కోరుతున్నారని కొందరు కాంగ్రెస్ పార్టీలో ఉన్న కార్యకర్తలు రాజకీయాలు చేస్తున్నారని అటువంటి రాజకీయా లు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బత్తుల సుజాత శ్రీనివాస్ యాదవ్‌కు మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. బత్తుల శ్రీనివాస్ ముదిగుంట గ్రామ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ఎమ్మెల్యే వివేక్ ద్వారా కృషి చేశారని తెలియజేశారు. బత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ తాము గతంలో ముదిగుంట గ్రామ సర్పంచ్ ఎన్నికైన సందర్భంగా కానుకూరు భూముల సమస్య గురించి పోరాటం జరిగిందని, గతంలో ఎంపీగా ఉన్న వివేక్ , మంత్రిగా వినోద్ ఉండగా నాడు ఎంపీ వివేక్ కానుకూరు భూముల సమస్యకు ప్రజలకు తమ వంతు మద్దతును ప్రకటించారని తెలియజేశారు. గతంలో తాము సర్పంచిగా పనిచేసినప్పుడు గ్రామ అభివృద్ధికి బోర్లు వేయించడం డ్రైనేజీ నిర్మాణం రోడ్లు వేయించడం సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూసామని



తెలియజేశారు. ఈ సందర్భంగా భత్తుల సుజాత మా ట్లాడుతూ 2006లో తన భర్త శ్రీనివాస్ యాదవ్‌ను సర్పంచ్‌గా ముదిగుంట గ్రామస్తులు ఎన్నుకున్నందుకు గ్రామాన్ని అభివృద్ధి చేశారని, మరొకసారి తాను సర్పంచ్ అభ్యర్థిగా నిల్చుంటున్నానని తమ ను తప్పకుండా ఓటు వేసి గెలిపిస్తారని ప్రజలను కోరారు.

# కిర్బీ కార్మికులను పరామర్శించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**జనోదయ,పటాన్చెరువు డిసెంబర్ 12**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని పాషా మైలారంలో కిర్బీ పరిశ్రమకు చెందిన బస్సు రోడ్డు ప్రమాదంకు గురైంది. ఈ ప్రమాదంలో గాయపడిన కిర్బీ పరిశ్రమ కార్మికులను పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పారామర్శించారు. గురువారం ఉదయం మొదటి షిఫ్ట్ కి బయలుదేరి వెళ్తున్న కిర్బీ పరిశ్రమ కార్మికుల బస్సుకు పాశమైలారం సమీపంలోని బిపిఎల్ చౌరస్తా సమీపంలో ప్రమాదానికి గురైంది.. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్ కార్మికులు చికిత్స పొందుతున్న పటాన్చెరులోని అమేధ ఆసుపత్రికి వెళ్లి కార్మికులను పరామర్శించారు. వైద్యులతో చర్చించి



కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గాయపడిన కార్మికులందరూ క్షేమంగా ఉన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎంఆర్ తో పాటు ఐఎన్టీయూసీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు అంతి రెడ్డి, శివ రెడ్డి, బండి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# కాలభైరవ స్వామి ఆలయానికి పెద్ద ఎత్తున పోటెత్తిన భక్తులు

**జనోదయ, కోటపల్లి, డిసెంబర్ 12**

మంచిర్యాల కోటపల్లి మండల్ పారుపల్లి గ్రామంలో భైరవ జయంతిని పురస్కరించుకొని భక్తులు భైరవ కొండకు పెద్ద ఎత్తున తరలివచ్చారు.దట్టమైన అటవీ ప్రాంతంలో వెలసిన కాల భైరవునికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు.అనంతరం నిర్వాహకులు అన్నదాన ప్రసాద వితరణ చేశారు. భక్తుల తాకిడితో అటవీ ప్రాంతం భైరవ నామస్మరణతో మారుమోగింది.భైరవ జయంతి ఉత్సవాలకు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ హైదరాబాద్ మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్ తది



తర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు రావడం వల్ల ఆలయ కమిటీ నిర్వహణ వారు కోటపల్లి మండల్ స్టేషన్ ఏర్పాటు చేశారు.

# ఆర్ఎంపీ, పీఎంపీల ఐక్యతా నినాదం

## దాడులకు వ్యతిరేకంగా గళం

**జనోదయ : ఉమ్మడి ఆదిలాబాద్**

రాష్ట్రవ్యాప్తంగా ఆర్ఎంపీ ( రూలర్ మెడికల్ ప్రాక్టీషనర్) ,పీఎంపీ (ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్) వైద్య మిత్రులలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల తమ వృత్తిపై జరుగుతున్న దాడులు, కేసుల నమోదు వంటి సంఘటనలు భయాందోళనలకు గురి చేస్తున్నాయని వైద్య మిత్రులు ఆవేదన చెందుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు (సర్పంచ్ ఎలక్షన్స్) ముగిసిన వెంటనే ఈ దాడులు మరింత పెరిగే అవకాశం ఉందని పలువురు వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ క్లిష్ట సమయంలో ఐక్యంగా ఉందాం, కలిసికట్టుగా పోరాడుదాం అనే నినాదం బలంగా వినిపిస్తోంది. కొంతమంది ఆర్ఎంపీ వైద్యులు ఆరోగ్య వృత్తితో పాటు ఎల్ఐసీ ఏజెంట్లుగా, మెడికల్ స్టోర్ల యజమానులుగా, లేదా ఇతర సైడ్ బిజినెస్లు చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. “మనపై దాడులు జరిగినా నాకేం? నేను రాను. వాళ్లు పోరాడుతారు కదా. ఇది కాకపోతే ఇంకో దారి ఉంది,” అనే ధోరణితో వారు సంఘ పోరాటాలకు దూరంగా ఉంటున్నారని మధ్య తరగతి వైద్యులు ఆరోపిస్తున్నారు. కేవలం వైద్య వృత్తిపై ఆధారపడి జీవనం సాగించే మధ్య తరగతి ఆర్ఎంపీ వైద్యులు మాత్రమే ఈ దాడులకు బలైపోతున్నారని, వారికే ఎక్కువ కష్టాలు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. పోరాటాల పేరుతో రోడ్ల మీదకు వస్తే, తమ కుటుంబ పోషణకు అదే ఏకైక మార్గం కాబట్టి, వారే ముందుంటారని మిగతా వర్గాలు వారికి అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంఘం నాయకుల పాత్రపై కూడా వైద్య మిత్రులలో అసంతృప్తి నెలకొంది.“నాయకులకు కూడా సైడ్ బిజినెస్లు, ఇతర ఆదాయ మార్గాలు ఉండడం వల్ల వారు తమ వృత్తి రక్షణ కోసం తీవ్రంగా పోరాడడం లేదు,” అని పలువురు విమర్శిస్తున్నారు. దాడులు జరుగుతున్నా, తమ లాగిన్ దాడులు ఆగిపోవడం లేదని, నాయకులు కేవలం “మంత్రులతో మాట్లాడుతున్నాం” అని ప్రకటనలు మాత్రమే ఇస్తున్నారని, క్షేత్ర స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదని అంటున్నారు. తమ తమ వ్యాపారాలు చూసుకుంటూ, మధ్య తరగతి వైద్యుడిని బలిపశువును చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ‘పరిస్థితి చేయి దాటిపోతుం డడంతో, కొంతమంది వైద్య మిత్రులు వైద్య వృత్తిని పూర్తిగా



బంద్ చేసి రోడ్డు మీదకు వచ్చి దారుణంగా పోరాటం చేద్దామని పిలుపునిస్తున్నారు.ఈ పోరాటానికి కేవలం మధ్య తరగతి వైద్యులు మాత్రమే వస్తారని, సైడ్ బిజినెస్లు ఉన్నవారు మాత్రం రావడం కష్టమని వారు స్పష్టం చేస్తు న్నారు.ఈ పోరాటంలో పాల్గొనని, తమ వృత్తి రక్షణకు సహకరించని వైద్య మిత్రులను సంఘం తరపున బహిష్కరించాలని, లేదా వారికి ఎలాంటి సహాయ సహ కారాలు అందించవద్దని మరికొంత మంది డిమాండ్ చేస్తున్నారు.ఆర్ఎంపీ, పీఎంపీ వైద్య మిత్రులు తమ హక్కుల కోసం, వృత్తి భద్రత కోసం సమష్టిగా నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ క్లిష్ట సమయంలో నాయకత్వం నిస్వార్థంగా పోరాటాన్ని ముందుకు నడపాలని, ప్రతి వైద్యుడూ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి సంఘీభావం తెలపాలని మధ్య తరగతి వైద్యులు కోరుకుంటున్నారు.

# బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యేకు చేదు అనుభవం



## కన్నెపల్లి మండల ప్రచారంలో తిరగబడ్డ జనం

**జనోదయ, బెల్లంపల్లి, డిసెంబర్ 12:**

బెల్లంపల్లి నియోజకవర్గంలోని కన్నెపల్లి మండలంలో శుక్రవారం బి ఆర్ ఎస్ పార్టీ మద్దతు అభ్యర్థుల కోసం పంచాయతీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు చేదు అనుభవం ఎదురైంది. ఓటర్లను అభ్యర్థించి బయటకు వస్తున్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య పై ప్రజలు తిరగబడ్డారు. నియోజకవర్గంలో పదేళ్లు ఎమ్మెల్యేగా కొనసాగిన కాలంలో తమ మండ లానికి ఏం మంచిపని చేశావని ఎన్నికల్లో బి ఆర్ ఎస్ మద్దతు అభ్యర్థులకు ఓట్లు అడగడానికి వచ్చా వంటూ తిరగబడ్డారు. మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య ఎంత సర్ది చెప్పేందుకు ప్రయ త్నించిన ప్రయోజనం లేకుండా పోయిం ది. అధికారంలో ఉన్నప్పుడు ఏ మాత్రం పట్టించుకోకుండా ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల్లో ఎందుకు వచ్చావని పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులం తా మూకుమ్మడిగా తిరగబడటంతో చేసే దేమీ లేక మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య ప్రచారాన్ని మధ్యలోనే వదిలేసి అక్కడి నుండి వెళ్ళిపోయారు.

# ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రణాళికబద్ధంగా పూర్తి చేయాలి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**జనోదయ,మంచిర్యాల**

2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఈ నెల 14వ తేదీన జరగనున్న 2వ విడత పోలింగ్ నిర్వహణ కొరకు ఎన్నికల సామాగ్రిని కేటాయించిన ప్రకారం ప్రణాళికాబద్ధంగా పంపిణీ పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని వేమనపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 2వ విడత ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుమారస్వామి తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా జరిగేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఓటింగ్, కౌంటింగ్ కొరకు అవసరమైన సామాగ్రి పంపిణీ చేయడంతో పాటు ఎన్నికల అధికారులు, సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 13వ తేదీన అధికారులు నిర్దేశిత సమయానికి తమకు కేటాయించిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలలో రిపోర్టు చేయాలని, ఆయా పోలింగ్ కేంద్రాల వారిగా కేటాయించిన ఎన్నికల సామాగ్రి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. 2వ విడతలో భాగంగా ఈ నెల 14వ తేదీన జిల్లాలోని బెల్లంపల్లి, భీమిని, కన్నేపల్లి, నెన్నెల, కాసిపేట, తాండూర్, వేమనపల్లి మండలాలలో గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్, పోలింగ్ సిబ్బంది, సూక్ష్మ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వహిం చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించడం జరుగుతుందని, ఈ నెల 14వ తేదీన ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, మధ్యాహ్నం 2 గంటల నుండి కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరూ నిర్భయంగా, నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కు వినియోగించాలని, అధికారులు, మీడియా ప్రతినిధులు అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు





వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా పారదర్శకమైన ఎన్నికలు జరిగేలా అధికారులు తమకు కేటాయించిన విధులను బాధ్యతా యుతంగా నిర్వర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉమెన్ సేఫ్టీ పై అవగాహన

**జనోదయ,భైంసా,డిసెంబర్ 12:**

భైంసా పట్టణంలోని గోపాల్ రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఉమెన్ సేఫ్టీ పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక సిఐ గోపీనాథ్ హాజరై విద్యార్థులకు సైబర్ నేరాలు, విద్యార్థులకు చట్టాలు, నిబంధనల గురించి తెలియజేసి, విద్యార్థి దశలో ఎదురయ్యే ఇబ్బందులను ఎలా అధిగమించాలో అధికారుల సహాయం ఎలా పొందలో ఉదాహరణ పూర్వకంగా వివరించారు. నేడు పెరుగుతున్న వేళ సైబర్ వేధింపులకు గురి కాకుండా ముందు జాగ్రత్తలు పద్ధతుల గురించి తెలిపారు. బెదిరింపులకు పాల్పడే ఘటన గురించి ఎలా బయటపడాలో, కాలేజీలలో ఎదురయ్య సమస్యలు, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే ఉండే శిక్షల గురించి పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏ సమస్య ఎదురైన విద్యార్థులు డయల్ 100 కు ఫోన్ చేసి వెల్లడించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వనజ, డాక్టర్ తోట రజనీకాంత్, డాక్టర్ నాగేష్, ముత్యం రెడ్డి,కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చయ్య, సిపిడిసి సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు



# బీరంగూడ కాలనీలో దారుణం

### మామను కత్తితో పొడిచి చంపిన అల్లుడు

**జనోదయ,పటాన్‌చెరు, డిసెంబర్ 12:** సంగారెడ్డి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. మామను అల్లుడు కత్తితో పొడిచి చంపడం స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధి బీరంగూడ కమాన్ సమీపంలో నివాసముండే చంద్రయ్య (58)ను అల్లుడు రామకృష్ణ కత్తితో పొడిచి హతమార్చాడు. రామ కృష్ణకు భార్యకు మధ్య మనస్పర్ధలు రావడంతో గత మూడు నెలలుగా తల్లి గారి ఇంటి వద్ద భార్య ఉంటున్నది. గురువారం సాయంత్రం చంద్రయ్య ఇంటికి రామకృష్ణ వచ్చి భార్యతో గొడవ పడుతుండగా చంద్రయ్య వారిని వారించాడు. ఆగ్రహానికి గురైన రామకృష్ణ అంతు చూస్తానని ఇంటికి వెళ్లి కత్తి తీసుకొని వచ్చి చంద్రయ్యను పొడిచి హత్య చేశాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



# జిల్లా ప్రజలకు అందుబాటులో పోర్టబుల్ ఎక్స్ రే మిషన్

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**జనోదయ, ఉమ్మడి జిల్లా ప్రతినిధి**

జిల్లాలోని క్షయ వ్యాధిగ్రస్తులకు, ప్రజలకు కేంద్ర క్షయ నియంత్రణ విభాగం, రాష్ట్ర వైద్య-ఆరోగ్యశాఖ క్షయ నియంత్రణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో పోర్టబుల్ ఎక్స్ రే మిషన్ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్ లో జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా. ఎస్.అనిత, ప్రోగ్రాం అధికారి డా.సుధాకర్ నాయక్ లతో కలిసి పోర్టబుల్ ఎక్స్ రే మిషను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజల సౌకర్యార్థం 23 లక్షల రూపాయలతో పోర్టబుల్ ఎక్స్ రే మిషన్ అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, ఈ నెల 21వ తేదీ నుండి జిల్లాలో సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో మారుమూల గ్రామాలలోని 1 లక్షా 76 మందికి పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని, ఈ పరికరాన్ని ఎ.ఐ.కు అనుసంధానం చేయడం జరిగిందని, పరీక్ష రిపోర్టును రోగికి, సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులకు, వైద్య నిపుణులకు పంపించడం జరుగుతుందని తెలిపారు. 60 సంల పైబడిన వారికి, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి, బరువు తక్కువగా ఉన్న వారికి, క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు, హెచ్.ఐ.వి. ఎయిడ్స్ రోగులకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుం దని తెలిపారు. ప్రజలకు వ్యయ ప్రయాసను తగ్గించడంతో పాటు రోగులకు వైద్య సేవలు చేరువలో అందింస్తామన్నారు. ఈ మిషన్ తో పాటు ఒక సాంకేతిక నిపు ణుడు, ఒక సూపర్వైజర్ అందుబాటులో ఉంటా రని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సమ న్వ యకర్త సురేందర్, డి.పి.ఓ. ప్రశాంతి పాల్గొన్నారు.



# ఉద్యోగులు రక్షణలో భాగస్వాములు కావాలి

### రక్షణ కమిటీ కన్వీనర్ జీవి కోటిరెడ్డి

**జనోదయ, మందమర్రి, డిసెంబర్ 12**

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి రక్షణలో భాగస్వామి కావాలని రక్షణ కమిటీ కన్వీనర్ జీవి కోటిరెడ్డి అన్నారు. 56 వ రక్షణ పక్షోత్సవాలలో భాగంగా తనిఖీ బృందం సభ్యులైన సేఫ్టీ కమిటీ కన్వీనర్ జీవి కోటిరెడ్డి, ఎస్ఓ టు జిఎం కొత్తగూడెం, ఏరియా ఎస్ఓ టు జి ఎం జి ఎల్ ప్రసాద్ ఏరియాలోని జివిటిసిని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు ఇచ్చిన సేఫ్టీ ఆపరేషన్ సూచనలను తప్పనిసరిగా పాటించాలని, దీనివల్ల ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయని, తద్వార సంస్థకు, దేశ భవిష్యత్తుకి మంచి పేరు వస్తుందని వారు అన్నారు. సంస్థ మనుగడ ఉండాలి అంటే వందశాతం పనిగంటలను ప్రతి ఉద్యోగి సద్వినియోగం చేసుకోవాలని వారు అన్నారు. అనంతరం ఏరియా ఎస్ఓటు జిఎం జి ఎల్ ప్రసాద్ మాట్లాడుతు రక్షణ కోసం ఉద్యోగులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేసిన రక్షణ పరికరాలను పనిముట్లను వాడాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని అన్నారు. అందుకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని అన్నారు. ప్రతి ఉద్యోగి ఆరోగ్యంగా ఉన్నప్పుడే సంస్థ బాగుంటుంది అని, మంచి ఆహారపు అలవాట్లను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. గనిలో అనుకోకుండా ప్రమాదాలకు గురి అయినప్పుడు ఉద్యోగికి అందించే (ఫస్ట్ ఎయిడ్) ప్రథమ చికిత్స గురించి ఉద్యోగులకు అర్థమయ్యే రీతిలో ఫస్ట్ ఎయిడ్ మెంబెర్స్ ఉద్యోగులకు వివరించారు. అనంతరం కమ్యూనికేషన్ సెల్ సిబ్బంది రక్షణ, జాగ్రత్తల గురించి వివరిస్తూ ఉద్యోగు లకు అర్థమయ్యే రీతిలో లఘు నాటిక అందరినీ ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో ఏరియా రక్షణ అధికారి భూ శంకరయ్య, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ, వి వెంకటరాజు డివైస్ ఇ ఈ అండ్ ఎం ఎండబ్ల్యూఎస్ కార్పొరేట్, వివి మధుకర్ డివైజిఎం (ఎస్ఎంఎంసి), వికె సిఎం, కొత్తగూడెం, జీవీటీసీ మేనేజర్ టి శ్రీధర్, జీవీటీసీ శిక్షకులు అశోక్, సీనియర్ అధికారులు జివిటిసి ఉద్యోగులు పాల్గొన్నారు.




# ఎన్నికల నేపథ్యంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

### స్వేచ్ఛాయుత ఎన్నికలు .. శాంతియుత భద్రత కోసమే ఫ్లాగ్ మార్చ్

### జైపూర్ సి ఐ నవీన్, ఎస్ ఐ శ్రీధర్

**జనోదయ,జైపూర్, డిసెంబర్ 12**

రామగుండము కమిషనర్ అఫ్ పోలీస్, ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ, జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు సూచనల మేరకు రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధి లోని కిష్టాపూర్, ఇందారం, టేకుమట్ల, చెట్టుపల్లి గ్రామాలలో జైపూర్ సి ఐ.నవీన్, ఎస్ ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ లో అధికారులు, సిబ్బందితో కలిసి ముఖ్యమైన రహదారులు, గ్రామాలలోని వాడ లలో పోలీసు బృందాలు నడుచుకుంటూ ప్రజలకు, పోలీస్‌లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారనే నమ్మకం, చట్టం, శాంతి భద్రతపై భరోసా కల్పించాయి.ఈ సందర్భంగా సి ఐ మాట్లాడుతూ ఎన్నికలలో ఎలాంటి అక్రమాలు, డబ్బు పంపిణీలు, బెదిరింపులు, ఓటర్లపై ఒత్తిడి వంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతి భద్రత కాపాడేందుకు ప్రత్యేకంగా ఫ్లాగ్ మార్చ్, పెట్రోలింగ్ చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఓటు విలువైనది. ప్రజలు స్వేచ్ఛగా వారి ఓటు వేయడానికి అన్ని రకాల పటిష్టమైన భద్రత పరమైన బందోబస్త్ ఏర్పాటు చేయడం జరుగుతుంది, శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛయుత ఎన్నికలు జరగాలని, ప్రతి ఒక్క ఓటరు ఎలాంటి ప్రలోబాలకి, బెదిరింపులకి లోను కాకుండా పోలింగ్ స్టేషన్ కి రావడమే పోలీసుల లక్ష్యం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో జైపూర్ సి ఐ. నవీన్, ఎస్ ఐ శ్రీధర్, ఏ ఎస్ ఐ బాలయ్య, రేగుంట మల్లయ్య సిబ్బంది పాల్గొన్నారు.



# నవోదయ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

### మూడరాపు పరమేశ్వర్



**జనోదయ, భైంసా,డిసెంబర్ 12:** నిర్మల్ జిల్లాలో శనివారం నిర్వహించే నవోదయ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ పాఠశాల అసిస్టెంట్ కమిషనర్ మూడరపూ పరమేశ్వర్ సూచించారు. జిల్లాలో పరీక్ష కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. నిర్వహించి నవోదయ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 1552 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని వారందరికీ పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలని అన్నారు.

# జోనల్ ఆఫీసర్స్ ఆర్ ఓ,పి ఓ లకు అవగాహన సదస్సు



**జనోదయ, జైపూర్,డిసెంబర్ 12**

మంచిర్యాల జిల్లా కలెక్టర్ మంచిర్యాల ఆదేశాల మేరకు జైపూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక నందు 2వ సాధారణ ఎన్నికలు -2025,సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నికల్లో భాగంగా 12 న స్టేజ్-2 జోనల్ ఆఫీసర్స్ ఆర్ ఓ,పి ఓ లకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది, శిక్షకులు లక్ష్మి నారాయణ ఇట్టి కార్యక్రమం కు హాజరై బ్యాలెట్ బాక్స్ లు, పోలింగ్ నిర్వహణపై ప్రేసిడింగ్ అధికారులకు అవగాహన కల్పించారు. సమావేశంకు ఎంపీడీఓ జి. సత్యనారాయణ తహసీల్దార్ వనజ రెడ్డి, ఆర్ డబ్లు ఎస్ డి ఈ విద్యాసాగర్, ఎంపీవో శ్రీపతి బాపు రావు , ఎం ఈ ఓ బి. శ్రీనివాస్, తదితరులు, సిబ్బంది పాల్గొన్నారు.

### వెంకటాపూర్లో స్వతంత్ర అభ్యర్థి తిరుపతి ప్రచారం



**జనోదయ, మందమర్రి డిసెంబర్ 12**

మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీలో స్వతంత్ర అభ్యర్థి భారతపు తిరుపతి ప్రచారం ముమ్మరం చేశారు. శుక్రవారం గ్రామంలో తన మద్దతు దారులతో కలసి బారి ర్యాలీ నిర్వహించి ఇంటింటికి తిరిగి ఓటర్లను కలిసి ఓటు అభ్యర్థించారు. తనను ఆదరించి గెలిపిస్తే గ్రామ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని అన్నారు. గ్రామస్తులందరూ ఈ నెల 17న జరగనున్న ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మద్దతుదారులు పాల్గొన్నారు.

### పొన్నారంలో స్వతంత్ర అభ్యర్థి కిష్టస్వామి ముమ్మర ప్రచారం



**జనోదయ, మందమర్రి డిసెంబర్ 12**

మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా మండలంలోని పొన్నారం గ్రామ పంచాయతీలో స్వతంత్ర అభ్యర్థి బర్ల కిష్ట స్వామి తన ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. శుక్రవారం గ్రామంలో తన మద్దతు దారులతో కలసి బారి ర్యాలీ నిర్వహించి ఇంటింటికి తిరిగి ఓటర్లను కలిసి ఓటు అభ్యర్థించారు. తనను ఆదరించి గెలిపిస్తే గ్రామ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని అన్నారు. గ్రామస్తులందరూ ఈ నెల 17న జరగనున్న ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అందరికీ అందుబాటులో ఉంటూ నిరంతరం ప్రజా సేవ చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మద్దతుదారులు పాల్గొన్నారు.

# పల్లెపోరు రెండోవిడతకు సర్వం సిద్ధం

**ఇల్లంతకుంట, బోయినపల్లి, తంగళ్ళపల్లి మండలాల్లోని 77 జీపీలు, 530 వార్డుల్లో ఎన్నికలు**

**18 రకాల గుర్తింపు కార్డులతో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు**

**జనోదయ: రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రెండో ఫేజ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి అవుతున్నాయి. ఈ నెల 14 న (ఆదివారం) 77 గ్రామ పంచాయతీలు, 530 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమైంది.

**మొత్తం ఓటర్లు 1,11,130 మంది**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని బోయినపల్లి, ఇల్లంతకుంట, తంగళ్ళపల్లి మండలాల్లో రెండో ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్నారు.బోయినపల్లి మండలంలో 14,753 మంది పురుషులు, 15,752 మహిళలు మొత్తం 30,505, ఇల్లంతకుంట మండలంలో 19,644 మంది పురుషులు, 20,902 మహిళలు మొత్తం 40,546, తంగళ్ళపల్లి మండలంలో 19,395 మంది పురుషులు 20,683 మహిళలు, ఇతరులు ఒకరు మొత్తం 40,079 ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లు 1,11,130 మంది ఉన్నారు.

**మొత్తం పోలింగ్ కేంద్రాలు**

బోయినపల్లి, ఇల్లంతకుంట, తంగళ్ళపల్లి మండలాల్లో మొత్తం గ్రామ పంచాయతీలు 88, వార్డు స్థానాలు 758 ఉండగా, 11 సర్పంచ్ స్థానాలు, 228 వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఈ నెల 14 వ తేదీన ఆదివారం 77 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు, 530 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. సర్పంచ్ స్థానాలకు అభ్యర్థులు 279, వార్డు స్థానాలకు అభ్యర్థులు 1,296 మంది పోటీలో ఉన్నారు.

**ప్రణాళిక సిద్ధం**

ఎన్నికలకు మూడు మండలాల్లో కలిపి మొత్తం ప్రిసైడింగ్ అధికారులు 910, అదర్ పోలింగ్ అధికారులు 1093 మంది విధులు నిర్వర్తించనున్నారు. ఎన్నికల సామగ్రి, అధికారులు, సిబ్బందిని తరలించేందుకు బోయినపల్లి మండలంలో మొత్తం జోన్స్ 4, రూట్స్ 8, ఇల్లంతకుంట మండలంలో జోన్స్ 5, రూట్స్ 8, తంగళ్ళపల్లి మండలంలో జోన్స్ 5, రూట్స్ 10 గా ప్రణాళిక సిద్ధం చేశారు. మూడు మండలాల్లో కలిపి మొత్తం 530 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు.

**ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా..**

ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటరు జాబితాలో పేరుండి ... ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) కాకుండా ఈ కింద చూపిన 18 ప్రత్యామ్నాయ ఫొటో ఐడీలలో దేనినైనా ఒకటి పోలింగ్ సిబ్బందికి చూపి తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఆధార్, భారతీయ పాస్ పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్ యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, బ్యాంకు, తపాలా కార్యాలయం జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్ బుక్, పాన్ కార్డు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్(ఎన్ఏఆర్) కింద రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్ ఇండియా జారీ చేసిన స్మార్ట్ కార్డు, శాసనసభ, శాసనమండలి జారీ చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అధికారిక గుర్తింపు కార్డులు, ఫొటోతో కూడిన స్వాతంత్ర్య సమరయోధుల గుర్తింపు కార్డు, లోక్ సభ, రాజ్యసభ జారీ చేసిన ఎంపీ గుర్తింపు కార్డు, ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందు జారీ చేసిన ఫొటోలతో కూడిన ఉపాధి హామీ జాబ్ కార్డు, కేంద్ర కార్మికశాఖ జారీచేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డ్, రేషన్ కార్డు, ఎస్సీ, ఎస్టీ, బీసీ ధ్రువ



పత్రాలు, పెన్షన్ పత్రాలు, ఆయుధాల లైసెన్స్, దివ్యాంగ ధృవీకరణ పత్రం, పట్టాదారు పాస్ బుక్‌తో ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

**ఎన్నికలకు సర్వం సిద్ధం**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగర్వాల్**

రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగర్వాల్ తెలిపారు. ఈ నెల 14న నిర్వహించే ఎన్నికలకు శనివారం రూట్ లు, డిస్ట్రిబ్యూటర్, రవాణాకు ఎన్నికల అధికారులకు, సామాగ్రి, సిబ్బందికి, అన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు



**జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**జనోదయ: రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రత సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఆయా శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించారు.ముందుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రమాదాలు అధికంగా జరగడానికి గల కారణాలను జిల్లా ఇంచార్జి కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... జిల్లాలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ లను ఆర్ అండ్ బి, ఎన్ హెచ్, పోలీస్, ట్రాన్స్ పోర్ట్ అధికారులు సంయుక్తంగా సర్వే చేయాలని ఆదేశించారు. ప్రమాదాలకు కారణమవుతున్న యూటర్న్ లను మూసి వేయాలని, రోడ్డుపై అధిక వేగంతో ప్రయాణించే వాహనాలను చెక్ చేసేందుకు స్పీడ్ గన్స్ కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో రోడ్డుకు సమీపంలో ఉన్న పాత బావుల పూడ్చివేత , రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపట్టి పూర్తి చేయాలని సూచించారు. రోడ్ల వెంబడి ప్రమాదాల నివారణకు ప్రస్తుతం రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాల్లో రేడియం సైన్ బోర్డు ఏర్పాటు చేయాలని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు.ఈసమావేశంలో ఆర్ టిఎ నాన్ అఫీషియల్ మెంబర్ సంగీతం శ్రీనాథ్, ఆర్ అండ్ బి ఇఇ నరసింహాచారి, జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్, డిపిఓ షరీఫుద్దీన్, పీఆర్ ఇఇ సుదర్శన్ రెడ్డి, జీజీహెచ్ సూపరిండెంట్ డాక్టర్ ప్రవీణ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, అన్వేష్, పోలీసు, ఎక్సైజ్ అధికారులు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**నేడే రేవంత్, మెస్సీ**

# ఫుట్‌బాల్ మ్యాచ్

**సాయంత్రం 7 గంటల నుంచి**

**ఎనిమిది గంటల వరకు మ్యాచ్**

**రాచకొండ సీపీ కీలక ఆదేశాలు**

**హైదరాబాద్, డిసెంబర్ 12:** సీఎం రేవంత్ రెడ్డి , మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఉప్పల్ స్టేడియం వేదికగా జరుగ నున్న ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఫుట్‌బాల్ మ్యాచ్ టికెట్లు కూడా హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. రేవంత్, మెస్సీ మ్యాచ్ నేపథ్యంలో రాచకొండ సీపీ సుధీర్ బాబు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచే ఈవెంట్ ఇది అని అన్నారు. శనివారం సాయంత్రం 7 గంటల నుంచి ఎనిమిది గంటల వరకు మ్యాచ్ జరుగనుందని.. మ్యాచ్ సందర్భంగా అందరూ క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. స్టేడియం దగ్గర పాసు లు అమ్మబడవని... ఇప్పటికే ఆన్‌లైన్‌లో పాసులను విక్రయించినట్లు చెప్పారు. పాసులు లేని వారు స్టేడియం వద్దకు రావద్ద న్నారు. మెస్సీకి జడ్ కేటగిరి భద్రత ఏర్పాటు చేశామని.. గ్రీన్ చానెల్ ద్వారా మెస్సీ ప్రయాణం చేస్తారని వెల్లడించారు. మ్యాచ్ లైవ్ టెలికాస్ట్ ఉంటుందని.. టికెట్స్ లేని వారు ఇంట్లో ఉండి టీవీలో చూడాలని కోరారు. మ్యాచ్‌కు వచ్చే వారు మూడు గం టల ముందే స్టేడియంకు చేరుకోవాలని... ఆలస్యంగా వచ్చే వారిని అనుమతించమని స్పష్టం చేశారు. మ్యాచ్ కోసం వచ్చే వారు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను వినియోగించాలని సూచించారు. వ్యక్తిగత వాహనాలు తీసుకురావడం వల్ల ట్రాఫిక్ సమస్య తలె త్తుతుందని తెలిపారు.వాహనాల పార్కింగ్ కోసం 34 ప్రాంతా ల్లో తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ఈవెంట్ సక్సెస్ అవ్వడానికి అందరి సహకారం అవసరమని సీపీ చెప్పారు. ఎవరైనా అను మతి లేకుండా మెస్సీని కలవాలి అని ప్రయత్నం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 3000 మంది పోలీసులు మ్యాచ్ కోసం భద్రతా విధుల్లో ఉంటారన్నారు. డ్రోన్ల ద్వారా మ్యాచ్‌ను, భద్రతను పర్యవేక్షిస్తామన్నారు. 450 కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామని.. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు భద్రతను పర్యవేక్షిస్తామని తెలిపారు. మఫ్టీలో కూడా అధికారులు ఉంటూ ఎప్పటికప్పుడు ప్రేక్షకుల కదలి కలపై నిఘా పెడతారని వెల్లడించారు. నిషేధిత వస్తువులు స్టేడియం లోపలికి తీసుకు రావద్దన్నారు. మ్యాచ్ చూడటం కోసం వచ్చే మహిళా ప్రేక్షకుల కోసం షీ టీమ్స్ కూడా అందు బాటులో ఉంటాయని సీపీ సుధీర్ బాబు పేర్కొన్నారు.

# మద్యం మత్తులో బ్యాలెట్ పేపర్లను మింగిన ఓటర్

**జనోదయ, జగిత్యాల ప్రతినిధి, డిసెంబర్ 11:** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని వెంకటాపూర్ గ్రామపంచాయతీ పోలింగ్ బూత్‌లో విచిత్ర సంఘటన చోటు చేసుకుంది. ఓటేసేందుకు వచ్చిన ఓ వృద్ధ ఓటర్ మద్యం మత్తులో ఉండటంతో, బ్యాలెట్ పేపర్‌ను సరిగ్గా ఎలా వాడాలో అర్థం కాకపోయి, దానిని మడిచి నోట్లో పెట్టుకుని మింగే ప్రయత్నం చేశాడు. సిబ్బంది చురుగ్గా స్పందించి, అతన్ని అడ్డుకున్నారు. అప్పటికే పేపర్ కొంత ముక్క చింపి మింగినట్లు గుర్తించారు. వెంటనే అతనిని బూత్ వెలుపలికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స చేశారు. పోలీసుల చొరవతో మద్యం మత్తులో ఉన్న అతన్ని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనతో అక్కడ కొంతకాలం గందరగోళం నెలకొంది. అధికారులు కొత్త బ్యాలెట్ పేపర్ జారీ చేసి, పోలింగ్ ప్రక్రియను పునఃప్రారంభించారు. స్థానికంగా ఈ సంఘటన హాట్ టాపిక్‌గా మారింది. ఎన్నికల సమయంలో ఓటర్లకు మద్యం పంపిణీ చేస్తున్న దుర్వినియోగంపై అధికారులు దృష్టి సారించారు. "ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం" అని ఎన్నికల అధికారి తెలిపారు. ఈ ఘటన ఎన్నికల నిబద్ధతపై ప్రశ్నలు కలిగించినప్పటికీ, అధికారులు వేగంగా స్పందించడంతో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది.



# ఎన్నికల కోడ్ ముగిసే వరకు విజయోత్సవ ర్యాలీలు నిషేధం

**-నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు**

**-జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్**

**జనోదయ, జగిత్యాల ప్రతినిధి, డిసెంబర్ 11:**

జిల్లాలో జరుగుతున్న తొలి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఓటర్లు ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఓట్ల లెక్కింపు పక్రియ సమయంలో ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని అన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎక్కువ మందిని ఉండకుండా చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు ముగిసే వరకు మోడల్



కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉందని మొదటి విడత ఎన్నికల ఫలితాలు ప్రకటించినప్పటికీ, గెలిచిన అభ్యర్థులు లేదా వారి అనుచరులు ఇప్పుడే విజయోత్సవ ర్యాలీలు, సభలు, బైక్ ర్యాలీలు, డీజేలు వంటి కార్యక్రమాలు నిర్వహించడం పూర్తిగా నిషేధం అన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉన్నందున ఆంక్షలను తప్పనిసరిగా పాటించాలని నియమాలను అతిక్రమించే ఏ చర్యనైనా సహించేది లేదని, ఉల్లంఘనలు జరిగితే వెంటనే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని ,ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగాలంటే నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరికీ బాధ్యత అన్నారు.

# అక్రమంగా మట్టి తవ్వకాలు

**జనోదయ, జైపూర్ డిసెంబర్ 11:**

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని కాన్పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మధున పోచమ్మ ఆలయ సమీపంలోని పంట పొలాల నుండి జెసిబి యంత్రంతో అక్రమంగా పలువురు మట్టితోవకాలు చేపట్టారు, ప్రభుత్వ అధికారులు స్థానిక సంస్థల ఎన్నికలలో ఉండడంతో ఇదే అదునుగా అక్రమార్కులు మట్టి దందాకు పాల్పడుతున్నారని వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు







## గెలిపిస్తే అకెనపల్లి అభివృద్ధికి పాటుపడతా

**జనోదయ, బెల్లంపల్లి, డిసెంబర్ 11:**
అకెనపల్లి ప్రజలు సర్పంచ్ గా తనను గెలిపిస్తే గ్రామ అభివృద్ధికి పాటుపడతానని బెల్లంపల్లి మాజీ ఎంపీపీ, అకెనపల్లి మాజీ సర్పంచ్ సుధమల్ల వెంకటి తెలిపారు. తాను గ్రామ సర్పంచ్ గా ఉన్న సమయంలో అందరికీ అందుబాటులో ఉండేలా గ్రామంలో ఎస్. బీ. ఐ బ్యాంకు ఏర్పాటుకు కృషి చేశానని తెలిపారు. గ్రామంలో రహదారులు, త్రాగునీటి ట్యాంక్ నిర్మించానని తెలిపారు. ఈసారి ప్రజలు తనని గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అకెనపల్లి, నార్వాయిపేట రోడ్డు నిర్మాణంతోపాటు, గ్రామంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.



## ఆ గ్రామంలో టీడీపీ సర్పంచ్ అభ్యర్థి ఘన విజయం

**జనోదయ, గంగాధర, డిసెంబర్ 11:**
తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నుంచి గ్రామస్థాయిలో తెలుగుదేశం పార్టీ ప్రభావం గణనీయంగా తగ్గిన విషయం తెలిసిందే. రాష్ట్ర రాజకీయాల్లో టిడిపి ఉనికి తగ్గిపోయిన నేపథ్యంలో వరుస ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులకు పెద్దగా అవకాశాలు రాలేదు. అయితే, గంగాధర మండలం లోజరిగిన తాజా మొదటి విడత గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో ఈ పరిస్థితికి భిన్నంగా ఫలితాలు నమోదయ్యాయి. గంగాధర మండలంలోని గట్టుబూత్కూర్ గ్రామ సర్పంచ్ పదవికి పోటీ చేసిన టిడిపి అభ్యర్థి మల్కాపురం రాజేశ్వరి బలమైన పోటీదారులను ఓడిస్తూ సర్పంచ్‌గా ఎన్నికవడం ప్రత్యేకంగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా టిడిపి బలహీన స్థితిలో ఉన్న తరుణంలో ఈ విజయాన్ని గ్రామస్తులు సెన్సేషన్‌గా భావిస్తున్నారు. స్థానిక స్థాయిలో ప్రజలకు



చేరువై పనిచేయడం, గ్రామ అభివృద్ధి అంశాలపై స్పష్టమైన హామీలు ఇవ్వడం, కుటుంబ సభ్యుల సానుకూల పాత్ర, గ్రామస్థుల విశ్వాసం కలిసి వచ్చి రాజేశ్వరి విజయం సాధించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రామ ప్రజలు కూడా అభివృద్ధి పనులు చేపట్టే నాయకత్వం అవసరం ఉన్నందున రాజేశ్వరికి మద్దతు ఇచ్చినట్లు తెలుస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద పార్టీల ఆధిపత్యం కొనసాగుతున్నా, గ్రామస్థాయిలో టీడీపీకి వచ్చిన ఈ అపూర్వ విజయం నాయకత్వానికి కొత్త ఉత్సాహాన్ని నింపనుంది.

# పోలింగ్ కేంద్రంలో మీడియా, పోలీసుల మధ్య వాగ్వాదం

**జనోదయ, గంగాధర, డిసెంబర్ 11:**
మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గంగాధర మండలంలో స్వల్ప ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. మధురా నగర్ గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద మీడియా ప్రతినిధులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామంలో ఓటింగ్ శాతం క్రమంగా పెరుగుతుండడంతో పోలింగ్ ప్రక్రియను సమీక్షించేందుకు వచ్చిన జర్నలిస్టులను పోలీసులు బూత్ లోపలికి అనుమతించలేదు. ఓటింగ్సజావుగా సాగుతోందా? ఎక్కడైనా యంత్రాల సంబంధిత సాంకేతిక లోపాలు ఉన్నాయా? ఓటర్ల రద్దీ పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవడానికి మీడియా ప్రతినిధులు బూత్‌లోకి వెళ్లడానికి ప్రయత్నించినప్పటికీ, ఎన్నికల నిబంధనలు, బూత్ డిసిప్లిన్‌ను కారణంగా చూపుతూ పోలీసులు వారిని అడుగు పెట్టనీయలేదు. ఇదే సమయంలో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో మీడియాను అనుమతిస్తుండగా, మరికొన్నింటిలో అనుమతించకపోవడం అసమానతగా ఉందని విలేకరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రెండు వర్గాల మధ్య కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసు అధికారులు మాట్లాడుతూ, "కేంద్ర స్థాయి మార్గదర్శకాల ప్రకారం ఏకీకృత విధానంలోనే అనుమతులు ఇవ్వాలి. బూత్‌లలో అవసరం లేని రద్దీ పెరిగితే పోలింగ్ అంతరాయం కలుగుతుంది" అని తెలిపారు. మరోవైపు జర్నలిస్టులు, ఎన్నికల పారదర్శకత కోసం మీడియా కవరేజీ అత్యంత ముఖ్యమని, ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒకే విధమైన విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్థానిక ఎన్నికల అధికారులు స్పందించగా, మీడియా ప్రవేశానికి సంబంధించిన స్పష్టమైన మార్గదర్శకాలు అందించాలని ప్రతిపాదనలు వెలువడ్డాయి. విలేకరుల అనుమతి, ప్రవేశ ప్రక్రియ, ఫోటోగ్రఫీ, వీడియో రికార్డింగ్ వంటి అంశాలపై స్పష్టత లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు పేర్కొన్నారు.

ఇదిలా ఉంటే, జర్నలిస్టుల అక్రిడిటేషన్ సమస్య కూడా మరో వివాదంగా నిలిచింది. "అక్రిడిటేషన్ కార్డు లేదని ప్రవేశం నిరాకరించడం సరికాదు" అని డిజేఎఫ్ (డబ్లూ) రాష్ట్ర ప్రచార కార్యదర్శి, పెద్దపల్లి జిల్లా డిజేఎఫ్ (డబ్లూ) ఇన్‌ఛార్జి విజయ్ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కొన్నేళ్లుగా ప్రభుత్వం మీడియా అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయకపోవడం వల్ల, సేవలందిస్తున్న విలేకరులు అనేక చోట్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. నిజంగా పనిచేస్తున్న రిపోర్టర్లు అక్రిడిటేషన్ లేదని, ఈ సమస్యను ప్రభుత్వమే తక్షణం పరిష్కరించాలని వారు కోరారు. "ఏళ్లుగా



గ్రామాల నుంచి జిల్లా కేంద్రాల వరకు సేవలందిస్తున్న విలేకరులకు కనీస గుర్తింపూ లేకపోవడం విచారకరం. ప్రభుత్వం ఒక స్పష్టమైన విధానం తీసుకొచ్చి, నిజంగా పనిచేస్తున్న మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ జారీ చేయాలి. లేకుంటే ఇలాంటి సమస్యలు ప్రతి ఎన్నికల్లో పునరావృతం అవుతూనే ఉంటాయి" అని డిజేఎఫ్ (డబ్లూ) రాష్ట్ర ప్రచార కార్యదర్శి, పెద్దపల్లి జిల్లా డిజేఎఫ్ (డబ్లూ) ఇన్‌ఛార్జి విజయ్ పేర్కొన్నారు.

# బసంత్‌నగర్ సర్పంచ్ బరిలో పరికిపండ్ల రామన్న




**జనోదయ,పెద్దపల్లి/బసంత్‌నగర్,డిసెంబర్ 12:** బసంత్‌నగర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పరికిపండ్ల రామన్న ఎన్నికల బరిలో నిలిచారు. లేడీ పర్స్ గుర్తుతో పోటీ చేస్తున్న ఆయనకు గ్రామ అభివృద్ధి కోసం అమూల్యమైన ఓటును వినియోగించి గెలిపించాలని గ్రామ ప్రజలను కోరుతున్నారు. ప్రజల ఆశీస్సులతో గ్రామానికి మరింత ప్రగతి తీసుకువస్తానని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## స్థానికంగా ఉంటా, భీమారం గ్రామాన్ని అభివృద్ధి చేస్తా



**జనోదయ భీమారం డిసెంబర్ 11 :**
భీమారం గ్రామ ప్రజలు ఓటు వేసి గెలిపించగలరని భీమారం సర్పంచ్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అలకాటి భాగ్యలక్ష్మితిరుపతి ఇంటింటా తిరుగుతూ గ్రామ ప్రజలను ఓట్లు అభ్యర్థించారు, సర్పంచ్ అభ్యర్థి అలకాటి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ స్థానికంగా ఉంటూ భీమారం గ్రామంలో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించడానికి, గ్రామ సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పద్మశాలి సంఘం నాయకులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దళితుని ప్రచార రతాన్ని ధ్వంసం చేసిన అగ్రవర్ణ కుల నాయకులు




**జనోదయ, జైపూర్, డిసెంబర్ 11 :**
మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో స్థానిక నివాసి అయిన దుర్గం మహేష్ కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీలో ఉండి ప్రచార రథాన్ని ఏర్పాటు చేసుకొని గ్రామ వీధుల్లో ప్రచారం చేస్తున్న క్రమంలో స్థానిక చర్చి దగ్గర ప్రచార రతాన్ని (ఆటో ) ఆపి ఆటో డ్రైవర్ కొత్తపెల్లి రాజయ్య ను అడ్డగించి నువ్వు మా వీధిలోకి ఎలా వస్తావు, నువ్వు తక్కువ జాతి వాడివి, మా వీధిలోకి వచ్చి ప్రచారం చేస్తావా అంటూ కులం పేరుతో దూషించి దౌర్జన్యం చేసి ఆటోకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చింపేసిన కిష్టాపూర్ గ్రామ నాయకులు కుర్మా శ్రీకాంత్, తాడ్వాయి మునీందర్ రెడ్డి, మల్లు సత్యనారాయణ రెడ్డి, చందుపట్ల జనార్ధన్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, తాడ్వాయి సత్యనారాయణ రెడ్డి అను వ్యక్తులు కిష్టాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి దుర్గ మహేష్ ఏర్పాటు చేసుకున్న ప్రచార రతాన్ని ధ్వంసం చేసినారు.

## శంకరపల్లి సర్పంచ్ గా వెంకటేష్ ఎన్నిక

**జనోదయ మందమర్రి డిసెంబర్ 11 :**
మండలంలోని శంకరపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ గా పెరుమాళ్ళ వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శంకరపల్లి గ్రామ సర్పంచ్ పదవి ఎస్టీ జనరల్ కు రిజర్వ్ కావడంతో సర్పంచ్ అభ్యర్థులుగా పెరుమాళ్ళ వెంకటేష్, మేసినేని మేఘన, ధైనేని తిరుపతి, ధైనేని రాజ్ కుమార్ లు నామినేషన్ లు దాఖలు చేశారు. నామినేషన్ ల ఉపసంహరణలో పోటీలో ఉన్న మేఘన, తిరుపతి, రాజ్ కుమార్, లు తమ నామినేషన్లు ఉపసంహరించు కోవడంతో పోటీలో ఉన్న ఏకైక అభ్యర్థి పెరుమాళ్ళ వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శంకరపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన వెంకటేష్‌ను పలువురు అభినందించారు.

